క్లుప్తంగా

ఐటీఐలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

మార్కాపురం టౌన్: ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ సంస్థ(ఐటీఐ)లో 2025–26 విద్యా సంవత్సరంలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ఎస్.వేణుగోపాల్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతి ఉత్తీర్ణులైన అభ్యర్థులు ఫిట్టర్, డ్రాఫ్ట్‌మెన్, కోపా(సీఓపీఏ) ట్రేడ్స్‌లో రెండో విడత ప్రవేశాలకు ఏపీ.జీటీవీ.ఇన్ పోర్టల్లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తులకు జూలై 15వ తేదీ వరకు గడువుందని తెలిపారు. వివరాలకు 95533 06631ను సంప్రదించాలని సూచించారు.

బాధ్యతలు చేపట్టిన రాజుపాలెం పీహెచ్‌సీ డాక్టర్


వేణుగోపాల్‌రెడ్డి

కొమరోలు: రాజుపాలెం ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యుడిగా డాక్టర్ కడప వేణుగోపాల్ రెడ్డి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఆరోగ్యశాఖలో జరిగిన బదిలీల్లో భాగంగా బేస్తవారపేట మండలం మోక్షగుండం పీహెచ్‌సీలో విధులు నిర్వహిస్తున్న డాక్టర్ కడప వేణుగోపాల్‌రెడ్డి బదిలీపై రాజుపాలెం పీహెచ్‌సీకి వచ్చారు. ఇక్కడ విధులు నిర్వహిస్తున్న డాక్టర్ జరియత్‌భాను బదిలీపై ఆకవీడు పీహెచ్‌సీకి వెళ్లారు.

పరిసరాల పరిశుభ్రతతో ఆరోగ్యం


సిబ్బందికి సూచనలిస్తున్న కమిషనర్

గిద్దలూరు రూరల్: పట్టణంలోని ఏబీఎం పాలెం చిల్డ్రన్స్ పార్కు ప్రాంతాన్ని నగర పంచాయతీ కమిషనర్ ఈవీ రమణబాబు సోమవారం పరిశీలించారు. చిల్డ్రన్స్ పార్కు వద్ద కొందరు వ్యక్తులు అపరిశుభ్రత వాతావరణాన్ని సృష్టిస్తున్నారని అందిన ఫిర్యాదుపై స్థానికులను విచారించారు. కమిషనర్ మాట్లాడుతూ.. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యతగా భావించాలని చెప్పారు. పరిశుభ్రతతోనే వ్యాధులు దరిచేరవని పేర్కొన్నారు. పట్టణంలో సమస్యలు పరిష్కరించేందుకు అధికార యంత్రాంగం సిద్ధంగా ఉందన్నారు. ఆయన వెంట శానిటరీ ఇన్‌స్పెక్టర్ సాయి, ఇంజినీరింగ్ సిబ్బంది పోర్షియా తదితరులు ఉన్నారు.

శ్యామ్‌ప్రకాష్ ముఖర్జీకి ఘన నివాళి


శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు

మార్కాపురం టౌన్: దేశ సమైఖ్యత కోసం ప్రాణాలు అర్పించిన మహానేత శ్యామ్‌ప్రకాష్ ముఖర్జీ అని బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పీవీ కృష్ణారావు కొనియాడారు. జన్ సంఘ్ అధ్యక్షుడు డాక్టర్ శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ బలిదాన్ దివస్ సందర్భంగా మార్కాపురంలోని పాత బస్టాండ్ వద్ద ఆయన చిత్రపటానికి బీజేపీ నాయకులు ఘనంగా నివాళులర్పించారు. దేశంలో ఇద్దరు ప్రధానులు, రెండు జెండాలు, రెండు చట్టాలు ఉండకూడదనే నినాదంతో శ్యాంప్రకాష్‌ముఖర్జీ అనేక పోరాటాలు చేశారని కొనియాడారు. కార్యక్రమంలో జాతీయ కౌన్సిల్ మెంబర్ శాసనాల సరోజిని, కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు బొంతల కృష్ణ, జిల్లా కార్యదర్శి ఎం.చిన్నయ్య, మహిళా మోర్చా జిల్లా ఉపాధ్యక్షురాలు మద్దెల లక్ష్మి, పట్టణ అధ్యక్షుడు ఆంజనేయులు, రామకృష్ణ, శివప్రసాద్, ఎ.సుబ్బారావు, జి.సతీష్ తదితరులు పాల్గొన్నారు.

మార్కాపురాన్ని జిల్లాగా ప్రకటించాలి


మార్కాపురం జిల్లా కోరుతూ అర్జీ ఇస్తున్న నాయకులు

మార్కాపురం టౌన్: మార్కాపురాన్ని జిల్లాగా ప్రకటించాలని కోరుతూ సబ్ కలెక్టర్ కార్యాలయం అధికారి దిలీప్‌కు కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ సభ్యుడు జావీద్ అన్వర్ వినతిపత్రం అందజేశారు. సోమవారం సబ్‌కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన మీ కోసంలో పలు సమస్యలపై ప్రజలు అర్జీలు ఇచ్చారు. ఈ సందర్భంగా అన్వర్ మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు మార్కాపురాన్ని జిల్లాగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. మార్కాపురం జిల్లాలో కర్నూలు జిల్లాలోని శ్రీశైలం, సున్నిపెంట, పల్నాడు జిల్లాలోని వినుకొండను కూడా కలపాలని కోరారు. వెలుగొండ ప్రాజెక్టుకు శ్రీశైలం నుంచి నీటిని విడుదల చేసేందుకు చర్యలు చేపట్టాలన్నారు. కాగా వివిధ సమస్యలపై ప్రజలు 10 అర్జీలు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా సాధన సమితి అధ్యక్షుడు ఎన్.దేవరాజ్, ఎస్.రామకృష్ణారెడ్డి ఉన్నారు.

రెవెన్యూ సేవలకు మంగళం!

- కంభం తహసీల్దార్ కార్యాలయంలో వేధిస్తున్న సిబ్బంది కొరత
- సమస్యల పరిష్కారంలో అలవిమాలిన జాప్యం
- బదిలీ అయిన, పదవీ విరమణ చేసిన స్థానాలు ఏడాదిగా ఖాళీ
- పనులపై వస్తున్న ప్రజలకు తప్పని తిప్పలు


కంభం తహసీల్దార్ కార్యాలయం

కంభం: ''రెవెన్యూ సేవ.. రైతులకు సేవ'' ఇటీవల రెవెన్యూ డే నిర్వహణ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన నినాదం. మాటల వరకైతే ఈ నినాదం బాగుంది కానీ క్షేత్ర స్థాయిలో ప్రజలకు రెవెన్యూ సేవలు అందడం గగనంగా మారింది. సిబ్బంది కొరతే అందుకు కారణం. వివరాల్లోకి వెళ్తే.. కంభం తహసీల్దార్ కార్యాలయంలో సుమారు ఏడాదిగా కీలక పోస్టులన్నీ ఖాళీగా ఉండటంతో పాలన గాడి తప్పుతోంది. రైతులు, ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం తహసీల్దార్ కార్యాలయానికి వస్తున్న వారి ఖాళీ సీట్లు దర్శనమిస్తుండటంతో ఎవరికి చెప్పుకోవాలో తెలియక సతమతం అవుతున్నారు. అర్జీల పరిష్కారంలో తీవ్ర జాప్యం చోటుచేసుకుంటోందని ప్రజలు ఆరోపిస్తున్నారు. దాదాపు ఏడాదిగా సిబ్బంది కొరత ఉన్నా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోకపోవడంపై ప్రజల్లో అసహనం వ్యక్తమవుతోంది. కంభం మండలంలో 14 పంచాయతీల్లో 16 రెవెన్యూ గ్రామాలున్నాయి. సుమారు 35 వేల ఎకరాల భూమి ఉంది. నిత్యం రైతులు పంట పొలాల సమస్యలు, విద్యార్థుల సర్టిఫికెట్లు, ఇతర పనుల కోసం తహసీల్దార్ కార్యాలయానికి వస్తుంటారు.

వేధిస్తున్న సిబ్బంది కొరత

కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత జరిగిన బదిలీల్లో ఇక్కడి నుంచి పలువురు అధికారులు వెళ్లిపోగా వారి స్థానంలో ఎవరినీ నియమించకపోవడంతో ఆ పోస్టులన్నీ ఏడాది నుంచి ఖాళీగా ఉన్నాయి. కార్యాలయంలో తహసీల్దార్, డిప్యూటి తహసీల్దార్, ఒక జూనియర్ అసిస్టెంట్, ఒక అటెండరు అందుబాటులో ఉన్నారు. 14 మంది వీఆర్వోలు ఉండగా చిన్నకంభం వీఆర్వో దీర్ఘకాలిక సెలవులో వెళ్లారు. మండలంలోని పలు గ్రామాల్లో రీసర్వే చేపట్టగా ప్రస్తుతం లింగాపురం కంద్రిగలో కొనసాగుతోంది. అయితే ఏడాది కాలంగా మండల సర్వేయర్ లేకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. గ్రామ సచివాలయ సర్వేయర్‌ను ఇన్చార్జిగా నియమించినప్పటికీ పూర్తి స్థాయి అధికారం, అనుభవం లేకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ఇటీవల జరిగిన బదిలీల్లో సైతం కొత్త అధికారులు రాకపోవడంతో సమస్య పరిష్కారం కాలేదు. రీసర్వే డిప్యూటీ తహసీల్దార్‌గా ఒకరు విధుల్లో చేరి వెంటనే డిప్యుటేషన్‌పై మరోచోటుకు వెళ్లిపోయినట్లు తెలిసింది. ఒకప్పటి నియోజకవర్గ కేంద్రమైన కంభం మండలంలో రెవెన్యూ సిబ్బందిని పూర్తి స్థాయిలో నియమించకపోవడం విమర్శలకు తావిస్తోంది.

ఇబ్బంది లేకుండా చూడాలి

ప్రస్తుతం కళాశాలల్లో అడ్మిషన్లు ప్రారంభమైన నేపథ్యంలో వివిధ సర్టిఫికెట్ల కోసం విద్యార్థులు రెవెన్యూ కార్యాలయానికి క్యూకడుతున్నారు. ఆన్‌లైన్‌లో తప్పిదాల పరిష్కారం కోసం రైతులు వస్తున్నారు. మరోవైపు గ్రామాల్లో భూముల రీసర్వే సాగుతోంది. సిబ్బంది కొరత ఉండటం వల్ల పనిలో జాప్యం జరుగుతుండటంతో ఉన్నతాధికారులు స్పందించి ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని ప్రజలు కోరుతున్నారు.

పోస్టు	ఉండాల్సిన సంఖ్య	అందుబాటులో ఉన్నవారు	ఖాళీలు
జూనియర్ అసిస్టెంట్	2	1	1
సీనియర్ అసిస్టెంట్	1	0	1
ఆర్ఐ	1	0	1
రీసర్వే డీటీ	1	0	0
మండల సర్వేయర్	1	0	1
ఏయస్ఓ	1	0	1
అటెండర్లు	3	1	0
చైన్‌మెన్	1	0	0
టైపిస్టు	1	0	1

యువత పోరుకు తరలిన కంభం నాయకులు


నాగంపల్లి నుంచి వెళ్తున్న యువకులు


కంభం నుంచి ఒంగోలుకు తరలివెళ్తున్న నాయకులు

కంభం: వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రమైన ఒంగోలులో సోమవారం నిర్వహించిన యువత పోరు కార్యక్రమానికి ఆ పార్టీ మండల కన్వీనర్ గొంగటి చెన్నారెడ్డి ఆధ్వర్యంలో మండలంలోని పలువురు యువకులు తరలివెళ్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత హామీలు నెరవేర్చకపోవడంతో నిరుద్యోగులు, రైతులు సహా అన్ని వర్గాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ నేపథ్యంలో ప్రజల తరఫున వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పోరాటలు చేస్తోందన్నారు. యూత్ ప్రెసిడెంట్ గురుమూర్తి, స్టూడెంట్ వింగ్ ప్రెసిడెంట్ షాహిద్, ఎంపీటీసీ ఆనంద్, మాజీ కోఆప్షన్ సభ్యుడు సయ్యద్ హుస్సేన్ బాషా, చిన్న చెన్నారెడ్డి, సుభాష్, తదితరులు వెళ్లారు.

కొనకనమిట్ల: వైఎస్సార్ సీపీ మండల విద్యార్థి విభాగం కన్వీనర్ తంగిరాల బ్రహ్మారెడ్డి ఆధ్వర్యంలో మండల యువకులు సోమవారం ఒంగోలులో యువత పోరు ధర్నాకు హాజరై సంఘీభావం ప్రకటించారు. కూటమి ప్రభుత్వ మోసాలను నిలదీస్తూ ఎప్పటికప్పుడు నిరసన కార్యక్రమాలు చేపడుతున్నట్లు బ్రహ్మారెడ్డి పేర్కొన్నారు. కార్యక్రమంలో చిరుగూరి కోటేశ్వరరావు, పి.నాగార్జునరెడ్డి, కరవర్ల డేవిడ్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

సచివాలయ సిబ్బందిని స్థానికంగానే నియమించాలి


సబ్‌కలెక్టర్ కార్యాలయంలో తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న సచివాలయ ఉద్యోగులు


సబ్‌కలెక్టర్ కార్యాలయం ముందు నిరసన తెలుపుతున్న ఉద్యోగులు

మార్కాపురం: గ్రామ/వార్డు సచివాలయ ఉద్యోగులు సొంత మండలాల్లో, సొంత మున్సిపాలిటీల్లో విధులు నిర్వహించేలా ప్రభుత్వం జీఓను సవరించాలని సచివాలయ ఉద్యోగులు డిమాండ్ చేశారు. సోమవారం ఉద్యోగ సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సంఘ నాయకులు మాట్లాడుతూ.. ఉద్యోగ భద్రత, ప్రమోషన్ చానల్, స్పష్టమైన జాబ్‌చార్ట్, సర్వీసు రూల్స్ లేని కారణంగా తీవ్ర ఒత్తిడితో విధులు నిర్వర్తించాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. వార్డు సచివాలయ సెక్రటరీలకు మున్సిపాలిటీ పరిధిలోనే ఇతర వార్డు సచివాలయాల్లో పోస్టింగు ఇవ్వాలని కోరారు. ప్రజలకు సేవలందిస్తున్న తమకు సర్వీసు రూల్స్ ఇంకా అమలులోకి రాలేదని, దీంతో ఉద్యోగ భద్రతపై అనిశ్చితి నెలకొందన్నారు. స్పష్టమైన నిబంధనలు రూపొందించాలని కోరారు. ఇతర ప్రభుత్వ శాఖల ఉద్యోగుల మాదిరిగా ప్రమోషన్స్ కల్పించాలని విజ్ఞప్తి చేశారు. ప్రమోషన్లు కల్పించి, రేషనలైజేషన్ చేసిన తర్వాత బదిలీలు చేయాలని, తద్వారా మిగులు సిబ్బందికి న్యాయం జరుగుతుందన్నారు. బదిలీల విధానాలు స్పష్టంగా ప్రకటించాలని, రాజకీయ ఒత్తిడి లేకుండా చూడాలన్నారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని సబ్‌కలెక్టర్ కార్యాలయంలోని తహసీల్దార్‌కు అందజేశారు. సచివాలయ ఉద్యోగులు చెన్నారెడ్డి, అంజినాయక్, కాశిరెడ్డి, ఫణీంద్ర, అరుణ్‌కుమార్, హేమలత, మల్లికార్జున్‌రెడ్డి, వివేక్‌రెడ్డి, ఆదినారాయణ, గణేష్, కరీముల్లా తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు వీడ్కోలు


ఉపాధ్యాయుడిని సన్మానిస్తున్న హెచ్ఎం మౌలాలి, విద్యార్థులు

తర్లుపాడు: మండలంలోని జగన్నాథపురం ఎంపీపీ పాఠశాలలో పనిచేస్తున్న అంజనీకుమార్, లింగారెడ్డికాలనీ స్కూల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయుడు షెక్షావలి బదిలీ కాగా సోమవారం తోటి ఉపాధ్యాయులు, గ్రామస్తులు ఘనంగా సన్మానించి వీడ్కోలు పలికారు. టీచర్ల సేవలను విద్యార్థుల తల్లి దండ్రులు, గ్రామస్తులు కొనియాడారు. కార్యక్రమంలో హెచ్ఎంలు మౌలాలి, జగన్ బాబు, ఉపాధ్యాయులు అలివేలు కుమారి, అనూష తదితరులు పాల్గొన్నారు.

తర్లుపాడు ఎంపీడీఓగా సుకుమార్



తర్లుపాడు: తర్లుపాడు మండల పరిషత్ అభివృద్ధి అధికారి(ఎంపీడీఓ)గా టి.సుకుమార్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. తర్లుపాడులో ఈఓఆర్‌డీగా విధులు నిర్వర్తిస్తున్న ఆయనకు ప్రభుత్వం ఎఫ్ఏసీగా అదనపు బాధ్యతలు అప్పగించింది. ఈ సందర్భంగా ఆయనను మండలంలోని పలు గ్రామాల పంచాయతీ సెక్రటరీలు కలిసి అభినందనలు తెలిపారు.

నీటి కుంట కాదు.. సీసీ రోడ్డు!


రోడ్డుపై నిలిచిన వర్షం నీరు

గిద్దలూరు రూరల్: పట్టణంలోని రాజానగర్ ముందు భాగంలో గల సీసీ రోడ్డు నీటి కుంటగా మారడంతో రాకపోకలు ఇబ్బందికరంగా మారింది. గత రాత్రి కురిసిన వర్షం కారణంగా రోడ్డుపై నీరు నిలిచాయి. రాజానగర్ ముందు భాగంలో సీసీ రోడ్డు లోతట్టుగా ఉండటం వల్ల రోడ్డుపై పడిన వర్షం నీరు కాలువల్లోకి వెళ్లేందుకు వీల్లేకుండా పోయింది. సమారు వారం పది రోజుల వరకు వర్షం నీటిలో నుంచే ప్రజలు రాకపోకలు కొనసాగించాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. ప్రధానంగా చిన్నపిల్లలు, వృద్ధులు రోడ్డు దాటేందుకు మరింత ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైన సంబంధిత మున్సిపల్ అధికారులు స్పందించి సిమెంట్ రోడ్డుపై నీరు నిలవకుండా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

ఎంపీపీ మాతృమూర్తికి 'కేపీ' ఘన నివాళి


నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే కేపీ, తదితరులు

బేస్తవారిపేట: మండలంలోని ఖాజీపురం గ్రామంలో సోమవారం ఎంపీపీ వేగినాటి ఓసూరారెడ్డి తల్లి మంగమ్మ దిశదినకర్మకు వైఎస్సార్ సీపీ గిద్దలూరు నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి హాజరయ్యారు. మంగమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. పార్టీ నాయకులు పిడతల ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, మండల కన్వీనర్ శ్రీధర్‌రెడ్డి, జెడ్పీటీసీ బీవీ రాజయ్య, అర్ధవీడు ఎంపీపీ వెంకట్రావు, మాజీ ఎంపీపీ గొటిక రాజేశ్వరరెడ్డి, సూరా స్వామిరంగారెడ్డి, తెల్ల కృష్ణారెడ్డి, భాస్కరరెడ్డి, శర్మ, బొల్లా బాలిరెడ్డి, ఆరు మండలాల సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, నాయకులు పాల్గొన్నారు.

పూలసుబ్బయ్య ఆశయాలు కొనసాగించాలి


మాట్లాడుతున్న ఎంఎల్ నారాయణ

మార్కాపురం టౌన్: పూలసుబ్బయ్య ఆశయాల సాధన కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సీపీఐ పార్టీ జిల్లా కార్యదర్శి ఎంఎల్ నారాయణ కోరారు. స్థానిక సీపీఎం కార్యాలయంలో సోమవారం పూల సుబ్బయ్య 38వ వర్ధంతి సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కష్టజీవుల సమస్యల పరిష్కారం కోసం భారత కమ్యూనిస్టు పార్టీలో చేరిన పూల సుబ్బయ్య అలుపెరుగని పోరాటాలు చేశారన్నారు. నాడు ఉద్యోగాన్ని సైతం వదులుకొని ప్రజాసేవకు అంకితమయ్యారని, తుది శ్వాస వరకు పార్టీలో కొనసాగిన గొప్ప నాయకుడని కొనియాడారు. కరువు కాటకాలతో సతమతం అవుతున్న పశ్చిమ ప్రకాశాన్ని సస్యశ్యామలం చేసేందుకు వెలిగొండ ప్రాజెక్టు నిర్మించాలని గుజ్జుల యలమందారెడ్డి, కాశిరెడ్డి, చెంచయ్య తదితర నాయకులతో కలిసి అనేక ఉద్యమాలు చేపట్టారని గుర్తుచేశారు. వెలిగొండ ప్రాజెక్టు పూర్తయితేనే రైతుల కష్టాలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందన్నారు. జిల్లా సహాయ కార్యదర్శి వెంకటరావు మాట్లాడుతూ.. ప్రజా సమస్యలు పరిష్కారం కావాలంటే ఆందోళనలు, పోరాటాలే శరణ్యమన్నారు. ముందుగా పూలసుబ్బయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కె.వీరారెడ్డి, కార్యవర్గ సభ్యులు అందె నాసరయ్య, నియోజకవర్గ కార్యదర్శి ఎస్‌కే ఖాశీం, సీపీఎం డివిజన్ కార్యదర్శి సోమయ్య, పూల సుబ్బయ్య కుమార్తె సునందిని, నాయకులు కొండయ్య, పెద్దన్న, డీకేఎం రఫీ, కార్మికులు పాల్గొన్నారు.

ఎరువులు, విత్తనాలు అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు


ఎరువుల దుకాణాన్ని తనిఖీ చేస్తున్న ఏఓ బుజ్జిబాయి

మార్కాపురం: మార్కాపురం పట్టణంతోపాటు రూరల్ మండలంలో ఎరువులు, విత్తనాలు, పురుగు మందులను అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఏఓ బుజ్జిబాయి హెచ్చరించారు. సోమవారం సాయంత్రం ఆమె మార్కాపురం పట్టణంలోని పలు ఎరువుల దుకాణాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రైతులు కొనుగోలు చేసే ఎరువులు, పురుగుమందులు, విత్తనాలకు తప్పనిసరిగా రసీదులు ఇవ్వాలని స్పష్టం చేశారు. నకిలీ విత్తనాలు అంటగట్టినా, అధిక ధరలకు ఎరువులు, పురుగుమందులు విక్రయించినా షాపు లైసెన్సులు రద్దు చేస్తామని హెచ్చరించారు. ప్రతి షాపులో ధరల పట్టిక, స్టాక్ బోర్డు అందరికీ కనిపించేలా ఏర్పాటు చేయాలని ఆదేశించారు.

డంపింగ్ యార్డులో చెత్త స్క్రీనింగ్ ప్రారంభం


డంపింగ్ యార్డులో చెత్తను వేరు చేస్తున్న యంత్రం

మార్కాపురం టౌన్: మార్కాపురం పట్టణంలోని చెత్తను పట్టణ శివారులో ఉన్న డంపింగ్ యార్డులో స్క్రీనింగ్ మిషన్ ద్వారా శుద్ధి చేస్తున్నట్లు కమిషనర్ నారాయణ రావు తెలిపారు. సోమవారం నుంచి డంపింగ్ యార్డులోని సుమారు 33 వేల టన్నుల చెత్తను స్క్రీనింగ్ చేసి వివిధ పదార్థాలను వేరు చేస్తున్నట్లు పేర్కొన్నారు. అందులో వచ్చే మట్టిని రైతులు తమ పొలాలకు ఎరువుగా వాడుకోవచ్చని తెలిపారు. కార్యక్రమాన్ని ఎమ్మెల్యే నారాయణరెడ్డి ప్రారంభించారు. ఆయన వెంట మున్సిపల్ సిబ్బంది, నాయకులు ఉన్నారు.

విద్యార్థులు సత్ప్రవర్తనతో చదువుకోవాలి


విద్యార్థులతో మాట్లాడుతున్న ఎస్సై రాజమోహన్

మార్కాపురం టౌన్: విద్యార్థులు సత్ప్రవర్తన కలిగి ఉండి విద్యను అభ్యసించినప్పుడే మంచి భవిష్యత్తు పొందవచ్చని టూటౌన్ ఎస్సై డాక్టర్ రాజమోహన్ తెలిపారు. సోమవారం స్థానిక సిద్ధార్థ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు సైబర్ క్రైమ్, ర్యాగింగ్, సైబర్ క్రైమ్, మత్తు పదార్థాల వినియోగం, నూతన ట్రాఫిక్ నిబంధనలు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఎస్సై మాట్లాడుతూ.. సమాజంలో జరుగుతున్న మోసాలపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండి, అటువంటివాటికి దూరంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ శ్రీనివాసరెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మోక్షగుండం పీహెచ్‌సీ వైద్యురాలిగా రజిత

బేస్తవారిపేట: మండలంలోని మోక్షగుండం పీహెచ్‌సీ వైద్యాధికారిగా డాక్టర్ రజిత భాను సోమవారం బాధ్యతలు చేపట్టారు. కొమరోలు మండలం రాజుపాలెం పీహెచ్‌సీలో విధులు నిర్వహిస్తున్న ఆమె సాధారణ బదిలీల్లో భాగంగా మోక్షగుండంలో నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రజలకు అందుబాటులో ఉంటూ మెరుగైన వైద్య సేవలు అందిస్తానని తెలిపార

హెల్మెట్‌తో ప్రాణాలకు రక్ష

అర్ధవీడు: ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని ఎస్సై బి.మదుసూదన్‌యాదవ్ సూచించారు. సోమవారం పాపినేనిపల్లె–కంభం రహదారిలో వాహనాలను ఎస్సై తమ సిబ్బందితో కలిసి తనిఖీ చేశారు. ధ్రువీకరణ పత్రాలు లేకుండా, మద్యం తాగి వాహనాలు నడిపితే జైలు, జరిమానా తప్పవని హెచ్చరించారు. మైనర్లకు వాహనాలు ఇస్తే తదుపరి చర్యలకు తల్లిదండ్రులు బాధ్యత వహించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. ఆటోల్లో సీట్ల సామర్థ్యానికి మించి ప్రయాణికులను రవాణా చేయవద్దని సూచించారు. నిబంధనలు అతిక్రమిచిన వారికి భారీ జరిమానా విధిస్తామని హెచ్చరించారు.

విద్యాభివృద్ధికి కృషి చేయండి

మార్కాపురం టౌన్: విద్యాశాఖాధికారులు నియోజకవర్గంలోని విద్యార్థులను తీర్చిదిద్దడంపై దృష్టి సారించాలని ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి సూచించారు. సోమవారం డీవైఈఈఓతో పాటు ఎంఈఓలతో ఆయన తన కార్యాలయంలో సమావేశమయ్యారు. నియోజకవర్గంలోని హైస్కూళ్లలో 8 నుంచి 10వ తరగతి వరకు విద్యార్థులకు యోగా తరగతులు నిర్వహించే అంశాన్ని పరిశీలించాలని కోరారు. 10వ తరగతిలో ప్రతిభ చూపిన విద్యార్థులకు, తీర్చిదిద్దిన ఉపాధ్యాయులకు బహుమతులు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో డీవైఈఓ శ్రీనివాసరెడ్డి, ఎంఈఓలు పాల్గొన్నారు.